

జంగారెడ్డిగూడెం పట్టణంలోని సీఎస్‌టీఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల

జంగారెడ్డిగూడెంలోని ఛత్రపతి శివాజీ త్రిశత జయంతి (సీఎస్‌టీఎస్) ప్రభుత్వ డిగ్రీ కళాశాల మరో మైలు రాయిని అధిగమించేందుకు సన్నద్ధం అవుతోంది. దాదాపు పుష్కర కాలం అనంతరం నాక్ గ్రేడు సాధించేందుకు సిద్ధమవుతోంది. 2007లో డిగ్రీ కళాశాల నాక్ బీ ప్లస్ గ్రేడును సాధించింది. తదనంతరం తిరిగి ఈ గ్రేడును పునరుద్ధరించుకొనే అవకాశం కలగలేదు. ఈనెల 25, 26 తేదీల్లో నాక్ కమిటీ డిగ్రీ కళాశాలకు విచ్చేయనుంది. ఈ నేపథ్యంలో అందుబాటులో ఉన్న వనరులను కమిటీ దృష్టికి తీసుకెళ్లి గ్రేడును మెరుగుపరచుకోవాలన్నది సీఎస్‌టీఎస్ డిగ్రీ కళాశాల సంకల్పం. దీని వల్ల కళాశాలకు గుర్తింపు రావడంతో పాటు రూసా నిధులు, అదనంగా అధ్యాపకులు, సిబ్బంది నియామకం, వనరుల కల్పన వంటి వాటికి అవకాశం కలుగుతుంది.

# నాక్ దిశగా అడుగులు

- సీఎస్‌టీఎస్ డిగ్రీ కళాశాలకు ఘన చరిత
- మన్యం, మెట్ట ప్రాంత విద్యార్థులకు కీలకం

జంగారెడ్డిగూడెం, న్యూస్‌టుడే

విద్యా ప్రదాత చింతలపాటి మూర్తిరాజు స్థాపించిన కళాశాలల్లో సీఎస్‌టీఎస్ డిగ్రీ కళాశాల ఒకటి. 1974లో ఈ కళాశాల ఏర్పడింది. ఈ కళాశాల పూర్వ విద్యార్థులు నేడు అత్యున్నత స్థానాల్లో ఉన్నారు. ఇంతటి ఘన చరిత్ర కలిగిన కళాశాల దశలవారీగా పురోగమిస్తున్నా.. పూర్తి స్థాయిలో అభివృద్ధి సాధించలేదు. ఇందుకు పలు సాంకేతిక ఇబ్బందులు ఉన్నాయి. ప్రధానంగా కళాశాలకు ప్రిన్సిపల్ పోస్టు లేకపోవడం ప్రగతికి ప్రతిబంధకంగా మారింది. బుట్టాయగూడెం డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ సుబ్రహ్మణ్యం ఇక్కడ అదనపు బాధ్యతలు నిర్వహిస్తున్నారు.

## మళ్లీ పెరుగుతున్న ప్రాధాన్యం

ఇంజినీరింగ్ విద్యతోపాటు సంప్రదాయ డిగ్రీ కోర్సులకు మళ్లీ ప్రాధాన్యం పెరుగుతోంది. జిల్లాలోని మన్యం, మెట్ట మండలాల్లో ప్రధానమైన జంగారెడ్డిగూడెం సీఎస్‌టీఎస్ కళాశాలలో బీఏ, బీకాం, బీఎస్సీ కోర్సులు అందుబాటులో ఉన్నాయి. బీఏలో హెచ్‌ఈపీ గ్రూప్‌తోపాటు ప్రత్యేక తెలుగుతో హెచ్‌ఈటీ, ప్రత్యేక ఆంగ్లంతో హెచ్‌ఈఈ గ్రూప్‌లు ఉన్నాయి. బీకాం, బీకాం కంప్యూటర్స్ విభాగం బీఎస్సీలో ఎంపీసీ, బీఎస్సీ కంప్యూటర్స్, సీబీజడ్ విభాగాలు ఉన్నాయి. మొత్తం 560 మంది విద్యార్థులు ఉన్నారు. 2019- 2020 విద్యా సంవత్సరానికి 360 సీట్లు ఉన్నాయి. ఇప్పటి వరకు 156 ప్రవేశాలు జరిగాయి. జూన్ నెల చివరి వరకు ప్రవేశాలకు అవకాశం ఉంది.

## అందుబాటులో వసతి గృహాలు

ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో చదివే ఎస్సీ, ఎస్టీ, బీసీ విద్యార్థులకు ఇక్కడ ప్రత్యేక వసతి గృహ సదుపాయం ఉంది. విద్యార్థులతోపాటు విద్యార్థినులకు గిరిజన సంక్షేమ శాఖ, సాంఘిక సంక్షేమ శాఖ, బీసీ సంక్షేమశాఖ వేర్వేరు వసతి గృహాలను నిర్వహిస్తున్నాయి. ఈ వసతి గృహాలలో చేరి ఇక్కడ ఉచిత విద్యను అభ్యసించేందుకు అవకాశం ఉంది. ఈ వసతి గృహాలన్నీ కళాశాలకు అతి సమీపంలోనే ఏర్పాటు చేశారు.



యోగాను అభ్యసిస్తూ...

## ప్రాంగణ ఎంపికలు..

ఈ కళాశాలలో 2018 - 19 విద్యా సంవత్సరంలో దాదాపు 120 మంది ప్రాంగణ ముఖాముఖిల్లో ఎంపికయ్యారు. బీకాం, బీకాం కంప్యూటర్స్, బీఎస్సీ విద్యార్థులు మెరుగైన వేతనాలతో ఈ ఉద్యోగాలు చేజిక్కించుకున్నారు.

## పతకాల పంట



డిగ్రీ కళాశాలకు ప్రధానంగా మంచి క్రీడా స్థలం ఉంది. అన్ని వసతులతో కూడిన జిమ్ కళాశాల సొంతం. విద్యార్థులు వివిధ క్రీడా పోటీల్లో పాల్గొని విశ్వవిద్యాలయం, సౌత్ జోన్ స్థాయిలో పతకాలు సాధించి కళాశాల కీర్తి ప్రతిష్ఠలను నిలబెడుతున్నారు. యోగ విద్యకు ఇక్కడ సముచిత స్థానం ఉంది. గడచిన ఏడాది కాలంలో వివిధ క్రీడలు, అథ్లెటిక్స్‌లో 25కు పైగా పతకాలు సాధించారు.



ఆధునిక పరికరాలతో కళాశాల వ్యాయామశాల

## సీబీజడ్‌కు డిమాండ్...

బీఎస్సీ సీబీజడ్ విభాగాన్ని ఇక్కడ మూడేళ్ల కిందట ప్రారంభించారు. ఈ విభాగానికి విపరీతమైన డిమాండ్ ఉంది. ఉన్న 40 సీట్లు చాలక ఏటా విశ్వవిద్యాలయం నుంచి ప్రత్యేక అనుమతితో అదనంగా విద్యార్థులను చేర్చుకుంటున్నారు. తరగతి గదుల కొరత కారణంగా రెండో సెక్షన్ ప్రారంభించే సాహసం చేయలేకపోతున్నారు. దాదాపు పది తరగతి గదుల కొరత ఉంది. ఈ ఏడాది నుంచి సీఎస్‌టీఎస్ డిగ్రీ కళాశాలలో ఎన్‌సీసీ ప్రారంభించనున్నారు. రెండు ఎన్‌ఎస్‌ఎస్ యూనిట్లు ఉన్నాయి. జవహర్ విజ్ఞానన కేంద్రం ద్వారా ప్రత్యేకంగా కంప్యూటర్‌పై బోధిస్తున్నారు.



జవహర్ విజ్ఞాన కేంద్రం

## సుందరంగా..



కళాశాలలో ఇప్పటికీ పురాతన నిర్మాణాలు ఉన్నాయి. వీటి స్థానంలో కొత్తవి నిర్మాణం జరగాలి. ఉన్న వాటినే ఆకర్షణీయంగా తీర్చి దిద్దుతున్నారు. గదులకు రంగులద్దుతూ తుదిమెరుగులు దిద్ది నాక్ కమిటీ కోసం సిద్ధం చేస్తున్నారు. కళాశాల అభివృద్ధి కోసం సీపీడీసీ (కాలేజ్ ప్లానింగ్ అండ్ డెవలప్‌మెంట్ కమిటీ), తల్లిదండ్రుల సంఘం, పూర్వ విద్యార్థుల సంఘాల సహకారం తీసుకుంటున్నాం. ప్రభుత్వ సహాయంతోపాటు దాతల సహకారంతో మరింత అభివృద్ధికి కృషి చేస్తున్నాం. విద్యార్థులు, అధ్యాపకులందరం నాక్ గ్రేడు సాధిస్తామన్న ఆశలో ఉన్నాం. శరవేగంగా ఈ పనులన్నీ చేస్తున్నాం.

\- పి.సుబ్రహ్మణ్యం, ప్రిన్సిపల్, సీఎస్‌టీఎస్ డిగ్రీ కళాశాల



విశాలమైన క్రీడా మైదానం

Scanned by CamScanner